క్లుప్తంగా

టీషర్ట్స్ అందజేత



కేసముద్రం : మున్సిపల్ పరిధిలోని సబ్‌స్టేషన్‌లో విద్యుత్ శాఖ ఏడీఈ మచ్చ ఐలయ్య ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ ఉద్యోగులకు దసరా కానుకగా టీషర్ట్‌లను బుధవారం అందజేశారు. ఏఈ రాజు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించాలి



నెహ్రూసెంటర్ : కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నేడు ఘనంగా నిర్వహించాలని సంఘం జిల్లా కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో సంఘ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల నిర్మూలనే లక్ష్యంగా కేవీపీఎస్ పని చేస్తోందని, గ్రామ గ్రామాన వేడుకలు నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో చీపిరి యాకయ్య, మచ్చ వెంకన్న, కందుకూరి రాంబాబు, పూల సురేష్, బొల్లంపల్లి సురేష్, గుడిశాల రామూర్తి, హరి పాల్గొన్నారు.

కనకతార భాగవతం ప్రదర్శన



చిన్నగూడూరు : మండల కేంద్రానికి చెందిన కళాబృందం ఆధ్వర్యంలో దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం రాత్రి కనకతార భాగవతాన్ని ప్రదర్శించారు. మండల కేంద్రానికి చెందిన సీనియర్ కళాకారులు గాడిపల్లి యాదగిరి, జక్కి వీరన్న, గాడిపల్లి రవీందర్, చంద్రయ్య, నాగేశ్వర్ కనకతార భాగవతాన్ని ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను తిలకించేందుకు వివిధ వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్థానికులు కళాకారులను అభినందించారు.

బెనిఫిట్స్ విడుదల చేయాలి



మహబూబాబాద్ : పెన్షనర్ల బెనిఫిట్స్‌ను తక్షణమే విడుదల చేయాలని రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ సంకా బద్రినారాయణ డిమాండ్ చేశారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో బుధవారం రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బద్రినారాయణ మాట్లాడుతూ.. విశ్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. నాయకులు గోవర్దన్, చంద్రమౌళి, రమేష్, బాబు, మైస నాగయ్య, సోమయ్య, వెంకట్‌రెడ్డి, మహేందర్, మోహన్‌రావు, రఘుపతి పాల్గొన్నారు.

నేటి రావణవధను విజయవంతం చేయాలి



తొర్రూరు/గూడూరు: తొర్రూరు డివిజన్ కేంద్రంలోని యతిరాజారావు పార్క్‌లో దసరా ఉత్సవాలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన రావణవధలో అన్నివర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్, తొర్రూరు సీఐ గణేష్, ఎస్సై ఉపేందర్ కోరారు. బుధవారం డివిజన్ కేంద్రంలో రావణవధ ఏర్పాట్లను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దసరా పండుగలో భాగంగా పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పాల్గొంటారని, అన్నివర్గాల ప్రజలు ఆనందించే విధంగా రావణవధ కార్యక్రమాలు ఉంటాయని, ప్రతి ఒక్కరు పాల్గొని వీక్షించాలని కోరారు. అలాగే గూడూరు మండల కేంద్రంలోని రామ్‌లీలా మైదానం (సంత) ప్రదేశంలో గురువారం (నేడు) దసరా వేడుకలకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

మూడు చోట్ల రావణ వధకు ఏర్పాట్లు

కేసముద్రం : మున్సిపల్ పరిధిలోని జ్యోతిరావు పూలే సెంటర్, తహసీల్దార్ కార్యాలయం ఎదుట, పొట్టి శ్రీరాములు సెంటర్‌లో దసరా సందర్భంగా రావణ వధకు బుధవారం ఏర్పాట్లు చేశారు. మూడు చోట్ల పోటాపోటీగా రావణ వధ నిర్వహిస్తుండడంతో స్థానికంగా చర్చనీయాశమైంది.

కొబ్బరికాయ ధర రూ.40

ఏపీనుంచి తగ్గిన దిగుమతి

- ఆందోళనలో వినియోగదారులు

తొర్రూరు రూరల్ : కొన్ని నెలలుగా కొబ్బరికాయల ధరలు రోజురోజుకు పెరుగుతూ కొండెక్కుతున్నాయి. శ్రావణమాసం ముందు నుంచే కొబ్బరి కాయలు, కొబ్బరి కుడుకలు, ఇతర కొబ్బరి ఉత్పత్తుల ధరలు అమాంతం పెరుగుతూ వస్తున్నాయి. ప్రధానంగా ఆంధ్ర ప్రాంతం నుంచి కొబ్బరికాయలు, ఇతర ఉత్పత్తులను దిగుమతి చేస్తూ తెలంగాణ ప్రాంతానికి చెందిన వ్యాపారులు విక్రయిస్తుంటారు. ఇటీవల ఆంధ్రప్రాంతంలో ఈదురు, గాలులతో భారీ వర్షాలు కురవడంతో కొబ్బరి తోటలకు తీవ్ర నష్టంవాటిల్లింది. దీంతో కొబ్బరి కాయల దిగుమతులు తగ్గిపోయి ధర అమాంతం పెరిగిపోయింది.



తొర్రూరులో విక్రయిస్తున్న కొబ్బరికాయలు

రూ.40కి చేరిన ధర

నాలుగైదు నెలలుగా కొబ్బరికాయల ధరలు విపరీతంగా పెరగడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. గతంలో హోల్‌సేల్ కొబ్బరి ధర ఒక్క కాయ రూ.15 ఉండగా, రిటేల్ ధర రూ. 20 లోపే ఉంది. కానీ ఒకేసారి ప్రస్తుతం ఒక్క కొబ్బరి కాయ ధర రూ.35 నుంచి రూ.40 చేరింది. దీంతో శ్రావణమాసం నుంచి గణపతి ఉత్సవాలతో పాటు, ప్రతి రోజు ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు పెరిగిన అధిక ధరలకు కొనుగోలు చేస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దేవాలయాలు, ఇంట్లో శుభకార్యలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆంధ్ర ప్రాంతం నుంచి కొబ్బరికాయల దిగుమతి ఎప్పుడు పెరుగుతుందో, ధరలు ఎప్పుడు తగ్గుతాయోనని వినియోగదారులు ఎదురు చూస్తున్నారు.

'సీపీఎం అభ్యర్థులను గెలిపించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్

బయ్యారం : స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల పక్షాన పోరాడే సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు కుంట ఉపేందర్ అన్నారు. బయ్యారంలోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని పలు పంచాయతీల్లో వార్డు, సర్పంచ్, ఎంపీటీసీ పదవులకు సీపీఎం పోటీ చేస్తోందని ప్రజలు ఆదరించాలన్నారు. సభ్యులు మండ రాజన్న, నంబూరి మధు, చంటి, తిరుపతిరావు, మోహన్, పురుషోత్తం, ఆనందరావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో ఆయుధపూజ



గూడూరు పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన ఆయుధపూజలో పాల్గొన్న సీఐ, ఎస్సై, సిబ్బంది

గూడూరు : మండల కేంద్రంలోని సర్కిల్ పోలీసు స్టేషన్‌లో బుధవారం దుర్గాష్టమి, గురువారం దసరా పండుగను పురస్కరించుకొని ఆయుధ పూజ నిర్వహించారు. సీఐ సూర్యప్రకాశ్, ఎస్సై గిరిధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయుధాలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, నేరాలు నియంత్రణలో విజయవంతం కావాలని అమ్మవారిని వేడుకున్నారు.

స్థానిక ఎన్నికల్లో సీపీఐని ఆదరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న విజయసారథి

నెహ్రూసెంటర్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ సత్తాచాటాలని, జిల్లాలో అత్యధిక అభ్యర్థులను గెలిపించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. పార్టీ జిల్లాస్థాయి ఎన్నికల సన్నాహక సమావేశం వీరభవన్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 25 ఎంపీటీసీ, 50 సర్పంచ్, 6 జెడ్పీటీసీ, 150 వార్డు మెంబర్ల పోటీ గెలుపునకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. ప్రజల పక్షాన పోరాటాలు నిర్వహించే సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల్లో మాదిరిగానే రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌తో చర్చలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సమావేశంలో అజయ్‌సారధిరెడ్డి, నల్లు సుధాకర్‌రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, తమ్మెర విశ్వేశ్వర్‌రావు, పెరుగు కుమార్, కట్లోజు పాండురంగాచారి, చింతకుంట్ల వెంకన్న, వరిపెల్లి వెంకన్న, కరణం రాజన్న, నెల్లూరు నాగేశ్వర్‌రావు, సారిక శ్రీనివాస్, వీరవెల్లి రవి, తూటి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

రెండు విడతల్లో స్థానిక ఎన్నికలు

- మండలాలను ప్రకటించిన అధికారులు

మహబూబాబాద్ : జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు రెండు విడతల్లో నిర్వహించనున్నట్లు కలెక్టరేట్ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు మొదటి విడతలో బయ్యారం, చిన్నగూడూరు, దంతాలపల్లి, గార్ల, గూడూరు, మానుకోట, నర్సింహులపేట, పెద్దవంగర, తొర్రూరు మండలాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈనెల 10నుంచి నామినేషన్ల స్వీకరణ, 23న పోలింగ్ ఉంటుందన్నారు. రెండో విడతలో డోర్నకల్, గంగారం, ఇనుగుర్తి, కేసముద్రం, కొత్తగూడ, కురవి, మరిపెడ, నెల్లికుదురు, సీరోలు మండలాలు ఉన్నాయన్నారు ఈనెల 13నుంచి నామినేషన్ల స్వీకరణ, 27 పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు.

షాపులను రద్దు చేయడం సరికాదు



గాంధీ పార్క్ ఎదుట రాస్తారోకో చేస్తున్న కూరగాయల విక్రయదారులు

మహబూబాబాద్ : మోడల్ మార్కెట్లో కూరగాయలు విక్రయించే వ్యాపారులకు కేటాయించిన షాపులను రద్దు చేయడం సరికాదని కూరగాయల మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు వెంకట్రావ్ ఆవేదన వ్యక్తం చేశారు. కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి స్థానిక గాంధీపార్కు ఎదుట రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావ్ మాట్లాడుతూ.. గాంధీ పార్కులో ఏర్పాటు చేసిన మార్కెట్‌లో కూరగాయలు విక్రయించే 60 మంది చిరు వ్యాపారులకు ఐదు రోజుల క్రితం మోడల్ మార్కెట్లో షాపులను కేటాయించారన్నారు. దసరా రోజు షాపులు ప్రారంభించుకోవాలని మున్సిపల్ కమిషనర్ టి.రాజేశ్వర్ తెలియజేసి తిరిగి వెంటనే రద్దు చేస్తున్నట్లు చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వెంటనే షాపులు కేటాయించకపోతే ఆందోళనను తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు. కమిషనర్, ఎమ్మెల్యే రావాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆందోళనతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. చిరువ్యాపారులు పాల్గొన్నారు.

పంటలకు బోనస్ చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చిన్న చంద్రన్న

నెహ్రూసెంటర్ : ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్‌ను వెంటనే చెల్లించాలని, మొక్కజొన్నలకు రూ.3వేల మద్దతు ధర చెల్లించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాయం చిన్న చంద్రన్న డిమాండ్ చేశారు. సంఘ సమావేశం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యానికి బోనస్ చెల్లిస్తామని ప్రకటించిదని, బోనస్ చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సమావేశంలో ఆవుల కట్టయ్య, జక్కుల యాకయ్య, గద్దల వెంకటయ్య, తడొడ్ల కేశవులు, బూర్గుల మోషె తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు మృతదేహం వెలికితీత

- కుటుంబ సభ్యుల నిరీక్షణకు తెర



మృతదేహాన్ని తీసుకొస్తున్న శ్రీనివాసరావు, బృందం

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని మున్నేటి వరదలో వారం క్రితం కొట్టుకొచ్చిన వ్యక్తి మృతదేహాన్ని బుధవారం ధంసలాపురం వద్ద గుర్తించారు. ఈమేరకు ఖమ్మం అర్బన్ పోలీసులు, అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు ఆధ్వర్యాన మృతదేహాన్ని వెలికితీసి కుటుంబసభ్యులకు అప్పగించారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌కు చెందిన బండెల వెంకటేశ్వర్లు(43) వాగులో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. నాలుగు రోజుల తర్వాత మృతదేహం ప్రకాష్‌నగర్ చప్టా వద్ద చిక్కుకున్నట్లు త్రీటౌన్ పోలీసులు గుర్తించి గత శనివారం బయటకు తీసేందుకు సిద్ధమైనా వాగు ఉధృతి కారణంగా సాధ్యం కాలేదు. ఈనేపథ్యంలో వెంటేశ్వర్లు మృతదేహాన్ని గుర్తించినట్లు తెలియడంతో అప్పటి నుంచి ఆయన కుటుంబ సభ్యులు మున్నేటి ఒడ్డునే పడిగాపులు కాస్తున్నారు. ఈమేరకు మృతదేహం వరదలో కొట్టుకెళ్తూ బుధవారం ధంసలాపురం సమీపానికి చేరగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఖమ్మం అర్బన్ పోలీసులు, అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు చేరుకుని కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని బయటకు తీశారు. ఆతర్వాత కర్రకు కట్టుకుని శ్రీనివాసరావు, ఆయన బృందం బయటకు తీసుకురాగా పంచనామా అనంతరం కుటుంబానికి అప్పగించారు.

పరామర్శ

కురవి : బీఆర్ఎస్‌కు చెందిన బాధిత కుటుంబాలను డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యా నాయక్ బుధవారం పరామర్శించారు. మండలంలోని నల్లెల్ల గ్రామంలో సయ్యద్ అఫ్జల్‌మియా, షేక్ షరీఫ్‌ల కాలు విరగగా వారి కుటుంబాలను, బీఆర్ఎస్ మైనార్టీ నాయకుడు షేక్ ఇమామ్ సతీమణి షాహిదా మృతి చెందగా అతని కుటుంబాన్ని, మాజీ సర్పంచ్ గుండెబోయిన సూరయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా అతడిని, మోద్గులగూడెం గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు దుబాకుల వెంకన్న తల్లి యాకమ్మ ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, గుగులోత్ రవినాయక్, శ్రీశైలం, నాగరాజు, ఉపేందర్, మంచిప్రోలు చంద్రారెడ్డి, బండి దీపక్, నిమ్మల గంటి కృష్ణమూర్తి, అంబటి శ్రీను, షేక్ ముస్తాఫా, అంబటి మల్లికార్జున్, గుండెబోయిన ఉప్పలయ్య, యాదయ్య, ఉపేంద్రాచారి, రాములు, ఎడ్ల ఉప్పలయ్య, మల్లయ్య, శ్రీనివాస్, సత్తిరెడ్డి, వెంకటనర్సింహారెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్ : వ్యాపారంలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని మహబూబాబాద్ టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి బుధవారం తెలిపారు. మహబూబాబాద్ పట్టణంలోని పత్తిపాక పరిధిలో బత్తుల రవికిరణ్ తన ఆఫీసులో డేటాఎంట్రీ జాబ్ చేస్తున్న యువతితో కొత్త వ్యాపారం పెడుతున్నానని నమ్మించాడు. ఆ వ్యాపారంలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని.. సదరు యువతి చేత సుమారు రూ.6 లక్షలు అతని వ్యాపారానికి తీసుకున్నాడు. కొద్ది రోజులు బాధితురాలు ఖాతాలోకి డబ్బులు పంపించి, ఆ తర్వాత డబ్బులు పంపడం ఆపేశాడు. ఈ విషయంపై బాధితురాలు రవి కిరణ్‌ను అడగగా తన అకౌంట్ ఫ్రీజ్ అయిందని, అది క్లియర్ అవ్వగానే ఎవరి డబ్బులు వారికి ఇస్తానని చెప్పాడు. ఎన్నిసార్లు అడిగిన తప్పించుకు తిరుగుతున్నాడని, మాయమాటలు చెప్పి వ్యాపారంలో పెట్టుబడి పెట్టించి డబ్బులు ఇవ్వకుండా మోసం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బత్తుల రవికిరణ్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

చంపుతామని బెదిరించిన వారిపై..

యువకుడిపై దాడి చేసి, చంపుతామని బెదిరించిన వారిపై కేసు నమోదు చేశామని మహబూబాబాద్ టౌన్ సీఐ మహేందర్ రెడ్డి బుధవారం తెలిపారు. మహబూబాబాద్ పరిధిలోగల బ్యాంక్ కాలనీలో నివాసముంటున్న వాసిరెడ్డి రామును ఖమ్మం జిల్లా ఇల్లెందు పట్టణానికి చెందిన కందుకూరి మధు, అతడి స్నేహితుడైన రాజకుమార్, సిసింద్రీ దుర్భాషలాడి దాడి చేశారు. అతడిని చంపుతామని బెదిరించారని, సదరు వ్యక్తులపై చట్టపరమైన చర్య తీసుకోవాలని రాము ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ప్రేమకు అడ్డొస్తున్నాడని వృద్ధుడిపై దాడి



గాయపడిన రాములు

కొత్తగూడ : ప్రేమకు అడ్డొస్తున్నాడని వృద్ధుడిపై దాడి చేసిన సంఘటన మండలంలోని వేలుబెల్లి గ్రామంలో వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. వేలుబెల్లికి చెందిన చెవ్వ రాములు మనుమరాలు అదే గ్రామానికి చెందిన యువకుడితో ప్రేమలో పడింది. ఈవిషయమై గ్రామంలో పంచాయితీ నిర్వహించి, ఎవరికి వారే ఉండాలని పెద్దలు తీర్మానించారు. అయినా వారి ప్రేమ వ్యవహారం కొనసాగుతుంది. అందుకు రాములు అడ్డు వస్తున్నట్లు భావించి బాలికను ప్రేమిస్తున్న యువకుడికి సంబంధించిన ముగ్గురు యువకులు దాడికి దిగినట్లు వృద్ధుడు తెలిపాడు. గాయపడిన వృద్ధుడిని స్నంపేట ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. ఎస్సై రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందలేదన్నారు.

విశ్వగురువు చేయడమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్

గూడూరు : భారత్‌ను విశ్వగురువు స్థానంలో నిలబెట్టడమే లక్ష్యంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) వందేళ్లుగా కృషి చేస్తోందని తెలంగాణ ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్ అన్నారు. మండల కేంద్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్‌ఎస్‌ఎస్ ప్రారంభించి వందేళ్లు పూర్తయ్యాయని తెలిపారు. 1925 నుంచి నేటి వరకు అనేక ఆటుపోట్లను ఎదుర్కొని ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్గనైజేషన్‌గా నిలబడిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బానోత్ సురేందర్ నాయక్, ఆర్‌ఎస్‌ఎస్ మానుకోట జిల్లా కార్యవహ పింగిళి శ్రీనివాస్, స్వయం సేవకులు పాల్గొన్నారు.

'స్థానికం'లో బీఆర్ఎస్ జెండా ఎగరాలి



నెల్లికుదురు: సమావేశంలో మాట్లాడుతున్న బానోత్ శంకర్‌నాయక్



గార్ల: సమావేశంలో మాట్లాడుతున్న హరిప్రియ



తొర్రూరు రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

- మానుకోట, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యేలు బానోత్ శంకర్ నాయక్, హరిప్రియ

నెల్లికుదురు : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగరాలని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో శంకర్ నాయక్ మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సైనికుల్లా పనిచేసి బీఆర్ఎస్ పార్టీ మద్దతు దారులను అధిక సంఖ్యలో గెలిపించుకోవాలని కోరారు. నాయకులు పరుపాటి వెంకట్‌రెడ్డి, యాసం రమేష్, బిక్కునాయక్, భీముడు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థులు అత్యధిక స్థానాల్లో గెలవాలి

గార్ల : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు అత్యధిక స్థానాలు గెలుచుకొని సత్తా చాటాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ కోరారు. బుధవారం గార్లలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యనాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఇల్లెందు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో త్వరలో జరుగనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌ల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు అత్యధిక స్థానాల్లో గెలవాలన్నారు. హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తాత్సారం చేస్తోందని, అదే విధంగా యూరియా దొరకక రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్ , ప్రధాన కార్యదర్శి పి.రాధాకృష్ణ, మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, బుడిగ మురళి, ఎండీ ఖదీర్, ఎం.భాస్కర్‌రావు, కోట ఉత్తరయ్య, మీగడ శ్రీనివాసరావు, ధరావత్ సక్రు, యాకూబ్‌పాషా,లక్ష్మారెడ్డి, వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ఓడించాలి..

తొర్రూరు రూరల్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఓడించాలని మాజీ జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ కోరారు. బుధవారం మండలంలోని చీకటాయపాలెం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అనేక మోసపూరితమైన హామీలు ఇచ్చిందన్నారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలు అందించడం, అభివృద్ధి చేయడం విస్మరించిందని విమర్శించారు. అందుకే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడిస్తేనే బుద్ధి వస్తుందని అన్నారు. నాయకులు శామకూరి ఐలయ్య, నలమాల ప్రమోద్‌గౌడ్, ఎన్నమనేని శ్రీనివాస్‌రావు, తండ కిష్టయ్య, బూర్గుల వెంకన్న, సోమన్న, కిషోర్, రాములు, వెంకటయ్య, దస్తగిరి పాల్గొన్నారు.

దసరాకు ముందే 'కిక్కు'



గూడూరులోని వైన్స్ ఎదుట మద్యం కోసం ఎగబడుతున్న జనం

గూడూరు : దసరా అంటే ప్రతీ ఇంట్లో సందడి ఉంటుంది. పండుగ రోజు మహిళలు పిండి వంటకాలు, బిర్యానీ వంటకాలు భుజించి, కూల్‌డ్రింక్స్ తాగుతారు. పురుషులకు మాత్రం మద్యంతో పాటు మాంసం ముక్క ఉండాల్సిందే. అయితే ఈ సంవత్సరం దసరా పర్వదినంతో పాటు, గాంధీ జయంతి ఒకే రోజు వచ్చాయి. అలాగే అక్టోబర్ 2న మద్యం, మాంసం దుకాణాల బంద్ నేపథ్యంలో మద్యంను ముందుగానే కొనుగోలు చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 59 వైన్స్‌లు, పదుల సంఖ్యలో బార్లు, రెస్టారెంట్లు ఉన్నాయి. సెప్టెంబర్ 29, 30వ తేదీల్లో జిల్లాలోని మద్యం షాపులకు ప్రభుత్వ మద్యం డిపో నుంచి రూ.16 కోట్ల 70 లక్షల లిక్కర్, బీర్ల అమ్మకాలు జరిగి, 59 వైన్స్‌లకు తరలినట్లు తెలిసింది. అక్టోబర్ 1న షాపు మూసేలోపు ఒక్కరోజున సుమారు మరో రూ.8కోట్ల వరకు మద్యం అమ్మకాలు జరుగుతాయని అంచనా. మొత్తానికి గాంధీ జయంతి సందర్భంగా ముందు రోజే మద్యం ఇళ్లకు తరలిపోగా, మాంసం విక్రయాలు కూడా గాంధీ జయంతి రోజు తెల్లవారే సరికి జరుగుతాయని సమాచారం.

మహిషాసుర మర్దిని అలంకరణలో దుర్గామాత



గూడూరు: పూజలో పాల్గొన్న భక్తులు



కేసముద్రంలో..

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ పట్టణంలోని నాగేంద్ర స్వామి ఆలయంలో కొలువైన శ్రీలలితా త్రిపుర సుందరిదేవి అమ్మవారు బుధవారంమహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు.

వైభవంగా మహాపూర్ణాహుతి

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మానుకోట వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో యజ్ఞం మహా పూర్ణాహుతి నిర్వహించారు. అలాగే మానుకోట పట్టణంలోని మహేశ్వరి భవన్ కొలువైన దుర్గాదేవి అమ్మవారు బుధవారం రాత్రి ఉజ్జయిని మహంకాళి అమ్మవారిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని అలంకరించి మార్వాడీలు పూజలు నిర్వహిస్తున్నారు.

గూడూరు : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన దుర్గాదేవి బుధవారం మహిషాసుర మర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

కురవి : మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో వేద పండితులు చండీహోమం నిర్వహించారు. ఈఓ సత్యనారాయణ, చైర్మన్ రవీందర్‌రెడ్డి, ధర్మకర్తలు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపంలో భక్తులకు బుధవారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎస్సై గండ్రాతి సతీష్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు చిత్తనూరి శ్రీనివాస్, వీరభద్రస్వామి ఆలయ ధర్మకర్త చిన్నం గణేష్, నిర్వాహకులు పాల్గొన్నారు.

అమ్మవారి హారం వేలం

కేసముద్రం : మున్సిపల్ పరిధిలోని ఆర్యవైశ్య భవనంలో కొలువుదీరిన దుర్గామాత అమ్మవారి హారాన్ని వేలంపాటలో కేసముద్రం విలేజికి చెందిన రామడుగు ధర్మాచారి రూ.70.116లకు దక్కించుకున్నారు. అనంతరం పూజలు నిర్వహించారు.